# 78 సీట్లతో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం

- మూడో సారి కేసీఆర్ సీఎం కావడం ఖాయం
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడ్‌పల్లి, నవంబర్ 2: గ్రేటర్ హైదరాబాద్‌లో అన్ని సీట్లలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులందరం గెలుస్తున్నామని, ఇందులో ఎలాంటి అనుమానం లేదని, 78 సీట్లతో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం సనత్‌నగర్ నియోజకవర్గం మోండా డివిజన్ పరిధిలో ఆదయ్యనగర్, సాంబమూర్తినగర్, టకారబస్తీ తదితర ప్రాంతాల్లో సనత్‌నగర్, బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ....మూడో సారి ముఖ్యమంత్రిగా సీఎం కేసీఆర్ కావడం ఖాయమన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు, అభివృద్ధి మన రాష్ట్రంలో జరిగిందని, ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి బీఆర్ఎస్ పార్టీకి మద్దతు పలుకుతున్నారని తెలిపారు. తాను ఈ ప్రాంతంలోనే పుట్టి పెరిగానని, ప్రజలందరూ ఎన్నికల ప్రచారంలో బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తరువాత బస్తీ, కాలనీల్లో ఏ విధంగా అభివృద్ధి జరిగిందో ప్రజలందరికీ తెలుసునని తెలిపారు. ముఖ్యంగా ఈప్రాంతంలో రెండు స్లమ్స్, 18 బస్తీలు ఉంటాయని, ఈ ప్రాంతం ఉన్న ప్రతి ఒక్కరూ ఆప్యాయతగా పిలుస్తూ...స్వచ్ఛందంగా మద్దతు చెబుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో కోట్ల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి తలసాని చెప్పారు.



మోండా డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

## కంటోన్మెంట్ సీటు బీఆర్ఎస్‌దే

### మంత్రి తలసాని



మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని మంత్రి, కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ మేరకు మంత్రి, కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో కార్ఖానాలోని సాయన్న నివాసంలో కీలక భేటీ జరిగింది. అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.... బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందితకు ప్రజల నుంచి అద్భుత స్పందన లభిస్తోందన్నారు. ఈనెల 9న నామినేషన్ కార్యక్రమం ఉంటుందని.. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి అందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

## బీఆర్ఎస్‌లో 100 మంది చేరిక

బేగంపేట్ : సనత్‌నగర్ నియోజకవర్గం బేగంపేట్, రాంగోపాల్‌పేట్ డివిజన్లకు వివిధ పార్టీల వారు సుమారు 100 మంది మంత్రి తలసాని సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌తోనే సుపరిపాలన సాధ్యం

### కూకట్‌పల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు చెందిన కుటుంబాలు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 2: తెలంగాణ రాష్ట్రంలో సుపరిపాలన సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని, ఆయా వర్గాల నేతలు నమ్మకంతో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు కూకట్‌పల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు చెందిన సురేశ్‌రెడ్డి, మాధవరెడ్డి, రత్నాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, ఫణీందర్‌రెడ్డి లతో పాటు వంద కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాలు, మతాలు, ప్రాంతాలకు సమప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పార్టీలో చేరిన నేతల కుటుంబాలన్నీ బీఆర్ఎస్ గెలుపుకోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సతీశ్ అరోరా, మాజీ కార్పొరేటర్ బాబూరావు, బండి మధుసూదన్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, కచిన్, జీఎల్ఎన్‌రెడ్డి పాల్గొన్నారు.

## పంజాబ్, మహారాష్ట్ర, బీహార్ వాసుల మద్దతు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు రెయింబో గేటెడ్ కమ్యూనిటీ కాలనీలో నివసించే పంజాబ్, మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాలకు చెందిన పలువురు నివాసితులు సంపూర్ణ మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి బతుకుదెరువు కోసం హైదరాబాద్ నగరానికొచ్చి స్థిరపడ్డ వారందరికీ ప్రభుత్వం అండగా ఉండి ఆదరించిందన్నారు. అన్ని వర్గాలు కలిసి మెలిసి ఉన్నప్పుడే ప్రగతి సాధ్యమవుతుందన్నారు. తెలంగాణ అభివృద్ధిని కాంక్షిస్తూ బీఆర్ఎస్‌కు మద్దతు పలికిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలన్నారు.

# వేలాది కోట్లతో నియోజకవర్గం అభివృద్ధి

### ఎల్బీ నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, నవంబర్ 2 : ఎల్బీనగర్ నియోకవర్గం ప్రజలు పిలిస్తే పలికే నాయకుడిని , అభివృద్ధి చేసే నేతను గెలిపించాలని ఎల్బీనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నాగోలు సాయినగర్ సీనియర్ సిటీజన్స్ ఆత్మీయ సమ్మేళనం, యెగ్గె మల్లేశం గార్డెన్స్‌లో బీసీ ఉప కులాల ఐక్యవేదిక ఆత్మీయ సమ్మేళనం, జైపురి కాలనీ బస్తీ వాసుల ఆత్మీయ సమ్మేళనం, ఎల్బీనగర్ నియోజకవర్గం సెవెన్ సీటర్స్ ఆటో యూనియన్ కార్మికుల ఆత్మీయ సమ్మేళనం, హస్తినాపురం శ్రీ బాలాజీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనాల్లో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని వేలాదికోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడిన వారికి అండగా ఉంటామన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అనంతుల రాజారెడ్డి, మాజీ కార్పొరేటర్ చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్, రమావత్ పద్మానాయక్, డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, గజ్జల మధుసూదన్‌రెడ్డి, చెన్నగోని శ్రీధర్ గౌడ్, సత్యం చారి, శ్యామల యాదగిరి వంశరాజ్, రాసమల్ల శ్రీనివాస్, సుర్వీరాజు, సతీశ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, ఆదిలక్ష్మి, పల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎల్బీనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

# హ్యాట్రిక్ తథ్యం

### శేరిలింగంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గాంధీ




బీఆర్ఎస్‌లో చేరిన వివిధ పార్టీల శ్రేణులతో ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్ , నవంబరు 2 : రెండు దఫాలుగా అధికారంలోకి వచ్చేందుకు పార్టీ శ్రేణుల కృషి ఎంతో ఉన్నదని, ఇదే మద్దతుతో ఈ ఎన్నికల్లోనూ హ్యాట్రిక్ తథ్యమని శేరిలింగంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ నెహ్రూనగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అక్బర్, వహీదాలు కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఆధ్వర్యంలో మాదాపూర్ డివిజన్ సాయినగర్‌కు చెందిన కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ పార్టీ కార్యకర్తలు పార్టీ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గాంధీ సమక్షంలో గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజలు ఎంతో సంతోషంగా, సంతృప్తికరంగా ఉన్నారని, ఈ ఎన్నికల్లో ప్రజలు సంపూర్ణ మద్దతు ఇచ్చి బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ ఇవ్వబోతున్నట్లు గాంధీ పేర్కొన్నారు. పార్టీలో చేరే ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, కష్టపడి పని చేసే కార్యకర్తకు ఉత్తమ భవిష్యత్ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు రాజుయాదవ్, రవీందర్ గౌడ్, పద్మారావు, అక్బర్, నయీమ్, లక్ష్మణ్, బాబా తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దానంకు పెరుగుతున్న మద్దతు



బీఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలతో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్/ఖైరతాబాద్: ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు రోజురోజుకు మద్దతు పెరుగుతున్నది. వివిధ డివిజన్ల నుంచి ఇతర పార్టీల నుంచి వస్తున్న కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. గురువారం బాలాపుర బస్తీకి చెందిన పలువురు కార్యకర్తలు ఎమ్మెల్యే దానం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, నాయకులు త్యాగరాజు, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు. ఇదే డివిజన్‌కు చెందిన జాఫర్ అలీబాగ్‌కు చెందిన పలువురు యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మరోవైపు జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని వినాయక్‌నగర్ బస్తీలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు ముమ్మరంగా ఇంటింటి ప్రచారం చేశారు. కాగా, సోమాజిగూడలోని జయగార్డెన్స్‌లో కార్పొరేటర్ వనం సంగీత యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం సమక్షంలో బీజేపీ, టీడీపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన సందీప్, శ్రీదేవి, రాజేశ్, మంత్రి శ్రీనాథ్‌తో పాటు సుమారు 50 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు.



## విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే దానం నాగేందర్

ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే, పీజేఆర్ కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డిని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. దోమలగూడలోని విష్ణు ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆయనతో కలిసి లంచ్ చేశారు. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేసిన పీజేఆర్ తనకు గురువు అని, ఆయన కుటుంబసభ్యులు అంటే తనకు ప్రత్యేక అభిమానం అని దానం నాగేందర్ పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం కోసం తన వంతు కృషి చేస్తానని విష్ణువర్ధన్ రెడ్డి హామీ ఇచ్చారు.

–బంజారాహిల్స్, నవంబర్ 2